క్లుప్తంగా

గుంతలు పూడ్చివేత



గుంతలు లేని రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

ఏర్పేడు : స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతలను శుక్రవారం పూడ్చివేశారు. ఈ నెల 16వ తేదీన రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు సమస్య పరిష్కరించారు.

షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న గోవుల షెడ్ల నిర్మాణాల కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన గోవుల షెడ్ల నిర్మాణాలపై ఏపీఓ భానుప్రియ, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలానికి 16 గోవుల షెడ్ల మంజూరైనట్లు వెల్లడించారు. వీటి నిర్మాణం కోసం తప్పనిసరిగా సర్పంచ్ తీర్మానం తీసుకోవాలన్నారు. 10 శాతం లబ్ధిదారుడి వాటాతో 90 శాతం ప్రభుత్వ రాయితీతో నిర్మించుకోవచ్చని వివరించారు. ఈ మేరు దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థులు



విద్యార్థులతో హెచ్ఎం రాజేశ్వరి

శ్రీకాళహస్తి: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ అండర్–19 పోటీల్లో పాల్గొనేందుకు శ్రీకాళహస్తి క్రీడాకారులు శుక్రవారం విజయవాడకు బయలుదేరారు. ఈ సందర్భంగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని రాజేశ్వరి మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ పోటీల కోసం తమ పాఠశాల నుంచి పీడీ శ్రీనివాసులు నేతృత్వంలో 8మంది విద్యార్థులు వెళ్లినట్లు వెల్లడించారు.

పరిహారం చెల్లించకుంటే దున్నేస్తాం



మాట్లాడుతున్న రామానాయుడు

ఏర్పేడు : మండలంలోని పల్లం రెవెన్యూలో టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం భూము లు అప్పగించిన ఎస్సీ, ఎస్టీలకు నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే ఆ భూములను దున్నేస్తామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పల్లంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లం, పల్లంపేట, ఎస్టీ కాలనీలకు చెందిన సుమారు 500 ఎకరాల డీకేటీ భూములను రెవెన్యూ అధికారులు సేకరించారన్నారు. వీటిలో 30 మంది దళితులు, గిరిజనులకు చెందిన 45 ఎకరాలకు ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్న కాళయ్య, శివకుమార్, రామయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఢిల్లీబాబు



నాగలాపురం: పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా బి.ఢిల్లీబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికుల సహకారంతో కళాశాల అభివృద్ధికి, పిల్లల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

పీహెచ్‌సీలో సేవలు బంద్

బుచ్చినాయుడుకండ్రిగ : పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదింపునకు నిరసనగా స్థానిక పీహెచ్‌సీలో సేవలు నిలిపివేశారు. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. వైద్యాధికారి దివాకర్ మాట్లాడుతూ వెంటనే ఇన్ సర్వీసు కోటా కుదింపు జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీఓ కారణంగా 336 సీట్లు తగ్గిపోతాయని, దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత ఏర్పడుతుందని వివరించారు.

శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో పేదల ఇళ్లను కూల్చివేయిస్తున్న దృశ్యం (ఫైల్)



విధ్వంస పాలనకు వందరోజులు

ఎలాగైనా గెలవాలి.. అధికారం అనుభవించాలి.. తరాలకు సరిపడా సంపాదించుకోవాలి.. ఇందుకోసం ప్రజలను నమ్మించాలి.. ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించాలి.. ఓట్లు రాబట్టుకోవాలి.. ఇదే లక్ష్యంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రణాళిక రూపొందించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పక్కాగా అమలు చేశారు. ఓటర్లకు మాయమాటలు చెప్పారు. అలవికానీ హామీలతో ఊరూవాడా ఊదరగొట్టారు. ఎట్టకేలకు మాయో.. మిష్టన్న మంత్రమో కానీ.. గద్దెనెక్కారు. అయితే వంద రోజులు గడుస్తున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. పైగా నిరుపేదల ఇళ్లను నిలువునా కూల్చేశారు. ప్రత్యర్థులపై కక్షగట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా అదిగో ఇదిగో అంటూ మభ్యపెడుతూ జనం చెవిలో పువ్వులు పెడుతున్నారు.

- ఎన్నికల హామీలకు తిలోదకాలు
- పేదల ఇళ్లు కూల్చి వికటాట్టహాసాలు
- కక్షపూరితంగా ప్రత్యర్థులకు వేధింపులు

రేణిగుంట : ×కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను గాలికొదిలేశారు. హామీల ఊసెత్తకుండా వైఎస్సార్ సీపీకి ఓట్లేసిన వారే లక్ష్యంగా దాడులు చేయిస్తున్నారు. ముఖ్యంగా పేద దళితుల ఇళ్లను అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేశారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై భౌతిక దాడులను చేయించి అక్రమ కేసులు పెట్టించారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా విదేశాల్లో విహరించారు.

ప్రధాన వాగ్దానాలివే..

- గోపాలన్న మార్కునకు మించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, రౌడీయిజం లేని పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, ఆస్తుల ధ్వంసం, అక్రమ కేసులను పెట్టి శాంతిభద్రతల సమస్య సృష్టించారు.
- **నిరుద్యోగులకు ఉపాధి ఏదీ..?:** నియోజకవర్గంలో కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అయితే ఈ వంద రోజుల పాలనలో కొత్త పరిశ్రమల ఊసే లేదు.
- **అటకెక్కిన రైతు ప్రయోజనాలు :** వ్యవసాయాన్ని లాభసాటి చేసి రైతు ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. రైతుల పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు నిర్మిస్తామన్నారు. అయితే ఇప్పటి వరకు ఈ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు.
- **ఆలయ మాస్టర్ ప్లాన్ ఊసేదీ..? :** శ్రీకాళహస్తి ఆలయ పవిత్రతను మరింత పెంచే విధంగా ఆలయ మాస్టర్ ప్లాన్ అభివృద్ధి, టెండర్లలో పారదర్శకత, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. చెత్త రహిత క్షేత్రంగా శ్రీకాళహస్తిని తీర్చిదిద్దుతామని చేసిన వాగ్దానాలకు విరుద్ధంగా మాస్టర్ ప్లాన్ పనులను అటకెక్కించారు. ఆలయాన్ని రాజకీయ కేంద్రంగా మార్చేశారు.
- **గూడు కూల్చి.. వేదన మిగిల్చి :** నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో కొందరు పేదలు సర్కారు త్వ స్థలాలలో చిన్నపాటి ఇళ్లు నిర్మించుకున్నారు. నియోజకవర్గంలో దళితుల ఇళ్లే టార్గెట్‌గా రేణిగుంట సీబీఐడీ కాలనీ, వివేకానంద కాలనీ, ఏర్పేడు మండలం వికృతమాల, శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లలో పేదల ఇళ్లను నేలమట్టం చేసి వారి జీవితాలను నాశనం చేశారు.
- **చేతి వృత్తులవారికి ఊతమిచ్చేదెప్పుడు..?:** నియోజకవర్గంలో కళంకారీ కళాకారులు, కొయ్యబొమ్మల తయారీ కళాకారులకు శ్రీకాళహస్తి ఆలయంలో వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేయడంతోపాటు కుల వృత్తులకు ఆదరణ పథకాన్ని తీసుకొస్తామన్నారు. అయితే కళంకారీ, కొయ్యబొమ్మల కళాకారులకు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు శ్రీకాళహస్తి ఆలయంలో వాణిజ్య సముదాయం ఎప్పుడు నిర్మిస్తారోనని వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

22న విద్యా వైజ్ఞానిక సదస్సు

రేణిగుంట : తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఈ నెల 22వ తేదీన ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ముని రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జితేంద్ర తెలిపారు. శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి హైస్కూల్ ఆవరణలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు.

వరద బాధితులకు రూ.25లక్షల విరాళం



మంత్రి లోకేష్‌కు చెక్ అందిస్తున్న ఈసీఎల్ ఎండీ, ఎమ్మెల్యే

రేణిగుంట : విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ (ఈసీఎల్) కంపెనీ ఎండీ సురేష్ ఖండేల్వాల్ రూ.25 లక్షల విరాళం అందించారు. శుక్రవారం ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి చెక్ అందజేశారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

ఏర్పేడు : ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సర్పంచ్ మోహనప్రియ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మొక్కలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద రెండేసి మొక్కలు నాటి వాటిని కాపాడాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు.

పచ్చదనంతో పలు ఉపయోగాలు

బుచ్చినాయుడుకండ్రిగ : చెట్ల పెంపకంతో పచ్చదనం పెరుగుతుందని, దీంతో పలు ఉపయోగాలు ఉన్నాయని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయం వద్ద స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.





ఏర్పేడు: మొక్క నాటుతున్న సర్పంచ్ మోహనప్రియ, బీఎన్ కండ్రిగ పాఠశాలలో మొక్క నాటుతున్న దృశ్యం

దాడిపై దర్యాప్తునకు డిమాండ్

శ్రీకాళహస్తి: కేవీబీపురం మండలం అంజూరుపాళెం దళితవాడవాసులపై అగ్రకులాలకు చెందిన కొంతమంది దాడి చేసి ఆస్తులు ధ్వంసం చేసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. ఆస్తుల నష్టానికి పరిహారం అందించాలని కోరారు. దళితులకు రక్షణ కల్పించడంతో పాటు ప్రేమ జంట తులసీరామ్, లావణ్యకు భద్రత కల్పించాలని సూచించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్, పట్టణ కార్యదర్శి గంధం మణి, నేతలు పెనగడం గురవయ్య, వేణు, నాగరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తమ్ముళ్ల కోసం వేలం వాయిదా?



సచివాలయం ముందు నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, రైతులు

శ్రీకాళహస్తి రూరల్ : టీడీపీ నేతల సేవలోనే అధికారులు తరిస్తున్నారు. వారికి మేలు చేసేందుకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నారు. అందులో భాగంగానే శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం పంచాయతీ తొండమనాడు పీడబ్ల్యూడీ చేపల చెరువు వేలం పాటకు రంగం సిద్ధం చేశారు. బహిరంగంగా ప్రకటిస్తే అందరూ పోటీకి వస్తారని కేవలం తమలోనే ఉండేలా ఓ ప్రకటనను ఈ నెల 13వ తేదీన విడుదల చేశారు. ఎలాంటి దండోరా వేయకుండా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటలకు తక్కువ మొత్తానికే తెలుగుతమ్ముళ్లకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నారు. అయితే ఈ విషయం ఎలాగోలా తెలుసుకున్న స్థానికులు, రైతులు సరైన సమయానికి సచివాలయానికి చేరుకున్నారు. వీరి రాకను గమనించిన అధికారులు గుట్టుగా అక్కడ నుంచి జారుకున్నట్లు తెలిసింది. సచివాలయంలో ఎవరూ కనిపించకపోవడంతో స్థానికులు చాలా సమయం అక్కడే వేచి ఉన్నారు. అధికారులు రాకపోవడంతో సచివాలయం నుంచి వెళ్లిపోయారు. దీనిపై పంచాయతీ అధికారి, ఎంపీడీఓకు ఫోన్ చేస్తే వారు స్పందించలేదు. ఎంపీటీసీ సభ్యుడు హరిరెడ్డి మాట్లాడుతూ సొసైటీకి రూ.2.67లక్షలు చెల్లించి చేపల చెరువును పంచాయతీ స్వాధీనం చేసుకుందన్నారు. ఇప్పుడు బహిరంగ వేలం నిర్వహిస్తే పంచాయతీకి కనీసం రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఆదాయం వస్తుందని వెల్లడించారు. అయితే టీడీపీ నేతలకు కేవలం రూ.3లక్షలకే చెరువును అప్పగించేందుకు అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు.

బైక్ స్టంట్‌లపై సోషల్ మీడియాలో పోస్టులు

- యువకుడిపై కేసు నమోదు చేసిన అలిపిరి పోలీసులు



సీజ్ చేసిన బైక్‌తోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న అలిపిరి పోలీసులు

తిరుమల: బైక్ స్టంట్స్ చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న యువకుడిని అలిపిరి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అలిపిరి సీఐ రామకిషోర్ మాట్లాడుతూ మంచాల వీధికి చెందిన రమేష్ బాబు కుమారుడు రాఘవేంద్ర రోహిత్ రెడ్డి యమహా ఆర్‌జెడ్ 15 మోటార్ సైకిల్‌ను లైసెన్స్ లేకుండా అతివేగంగా నడుపుతూ ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. విచిత్రమైన చేష్టలతో వింత శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బైక్‌పై స్టంట్‌లు చేస్తున్న వీడియోలను తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవాడన్నారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని, బైక్ సీజ్ చేశామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు తన సోషల్ మీడియా అకౌంట్‌లో తనను పోలీస్ వారు పట్టుకున్న ఫొటోను సైతం షేర్ చేస్తూ, తన లాగా ఎవరు ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు చేసి, సాధారణ ప్రజలకు అపాయం కలిగించవద్దని పోస్ట్ చేశాడని వెల్లడించారు



ఊరేగుతున్న అమ్మవారు

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. శుక్రవారం తలారివెట్టు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేస్తున్న పోషకాహారం భుజించాలని సూచించారు. పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యమున పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలే శ్రేష్టమని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. శుక్రవారం సత్యవేడు పంచాయతీ దళవాయి అగ్రహారం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లులు బలవర్థకమైన ఆహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు. గర్భిణులు, బాలింతలు ఫైబర్ అధికంగా ఉన్న ఓట్స్, చిరుధాన్యాలు, విత్తనాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కాంతమ్మ, బాగ్యలక్ష్మి, ఏఎన్ఎం లతాదేవి, సుమ, ఆశావర్కర్లు జలశీల, విద్య పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు ప్రారంభం



అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి మార్గం, రామసేతు వంతెన వద్ద రెండు అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ఈ క్యాంటీన్లు ఉపయోగపడతాయని తెలిపారు.

నేడు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఈఓ ఎస్వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏటా పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వెల్లడించారు.

మానసిక రోగులకు సేవలు

తిరుపతి కల్చరల్ : మానసిక రోగుల రహిత సమాజమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని మనోబంధు ఫౌండేషన్ మేనేజర్ రామకృష్ణమరాజు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో మానసిక రోగంతో వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిని గుర్తించి మంచి వైద్యం అందించి, వారి బంధువులకు అప్పగించామని వెల్లడించారు. మానసిక రోగుల సమాచారాన్ని ఫౌండేషన్ వలంటీర్లకు అందించాలని కోరారు. వివరాలకు 9246563738 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పి.అంజయ్య, బాబు, కేశవులు, భాస్కర్, జయపాల్, నాగేంద్ర పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో రిజర్వేషన్‌కు వినతి

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వం కేటాయించే మద్యం షాపులలో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సేవాదళ్ నేత తలారి రాజేంద్ర విన్నవించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో సేవా దళ్ నేతలు రాజశేఖర్, వంశీ, విజయ్, సంజీవి, వాసు పాల్గొన్నారు.

వేడుకగా ఊంజల్ సేవ

నారాయణవనం : పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అమ్మవారికి విశేష అభిషేకం జరిపించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం కనులపండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధికారులు నాగరాజు, భరత్, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊయలపై కొలువుదీరిన అమ్మవారు

జీఓ నంబర్ 70 రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న దివాకర్

శ్రీకాళహస్తి : ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు హయ్యర్ పెన్షన్ అమలులో సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1/2019 సర్కులర్ అమలు చేయాలని జీఓ నంబర్ 70 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శివకుమార్, ఎన్వీకే రెడ్డి, జిలానీ, దేవి రాజకుమారి, మనోహరి, విజయలక్ష్మి , పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

ఉత్కంఠగా క్రికెట్ పోటీలు

రేణిగుంట : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సీఆర్ఎస్ వెస్ట్ కాలనీ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. డిప్యూటీ సీఎంఈ జట్టుపై సీడబ్ల్యూఎం జట్టు విజయం సాధించింది. ముందుగా సీఆర్ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం, డిప్యూటీ సీఎంఈ రమేష్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించామని తెలిపారు.కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ నవీన్ కుమార్, సెక్రటరీ రాబర్ట్, జాయింట్ సెక్రటరీ హరీష్ పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న దేవసహాయం

తూతూమంత్రం.. 'మంచి ప్రభుత్వం'



తిరుపతి ఎమ్మెల్యే సభలో ఖాళీ కుర్చీలు

తిరుపతి మంగళం : వంద రోజుల పాలనపై శుక్రవారం తిరుపతి జీవనకోనలోని రాజీవ్‌గాంధీ కాలనీలో చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తూతూమంత్రంగా నిర్వహించారు. తమకు అనుకూలమైన వారితో నాలుగు మెప్పు మాటలు చెప్పించి ముగించారు. అయితే కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనపై నగర ప్రజలు గుర్రుమంటున్నారు. ఏదో సాధించేసినట్లుగా, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు అమలు చేసినట్లుగా × ఇది మంచి ప్రభుత్వం । అని చెప్పుకోవడంపై మండిపడుతున్నారు. టీడీపీ కోసం పనిచేసిన వారికే ఎలాంటి న్యాయం చేయడంలేదని, ఇక ప్రజలకు ఏం చేస్తారని స్థానిక నేత శ్యామలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో వెంటనే ఆమె వద్ద నుంచి మైక్ లాగేసుకుని కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడే ముగ్గురిని సెలక్ట్ చేసుకుని వారితో మాట్లాడించుకున్నారు. గ్యాస్ సిలిండర్లు, కొత్త రేషన్‌కార్డులు, తల్లికి వందనంపై ప్రశ్నించేందుకు వచ్చిన మహిళలకు అవకాశం కల్పించలేదు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే పెద్దసంఖ్యలో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

హాస్యాస్పదంగా ఫ్లెక్సీలు

ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోయినా ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి స్థానికులు నవ్వుకున్నారు. ఇవి ఎక్కడ అమలు చేశారని ఘనంగా ఫ్లెక్సీలు పెట్టారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలోనే వేదికపైన ఎమ్మెల్యేతో పాటు ముందు వరుసలో కూర్చునేందుకు టీడీపీ, జనసేన నాయకులు కుర్చీలు చేతపట్టుకుని పోటీ పడ్డారు.



ఆలయం వెలుపల కొరటాల శివ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో సినీ డైరెక్టర్ కొరటాల శివ, ఎమ్మెల్యే విరుపాక్షి, తెలంగాణ ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

తిరుచ్చిపై సిరుల తల్లి

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అభిషేకం చేసి, సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

